ఆపదలో పల్లె వైద్యం

- వైద్యుల సమ్మెతో అరకొరగా వైద్యం
- 104 సేవలు అందక గ్రామీణుల ఇక్కట్లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

చాగల్లు: రోగులకు ప్రభుత్వ వైద్య సేవలు అరకొరగా అందుతున్నాయి. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైద్యులు కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. అందువల్ల వైద్య సేవలు కోసం చాలా మంది ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. మండలంలోని చాగల్లు, మార్కొండపాడు, కలవలపల్లి, బ్రాహ్మణగూడెం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా మండలంలోని ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారు. మండలంలో సుమారు 60 వేల జనాభా ఉంది. ఈ పీహెచ్‌సీలకు రోజుకు సుమారు ఐదు వందల మంది రోగులు (ఓపీ) వస్తుంటారు. ఒక్కో పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులు వైద్య సేవలు అందించేవారు. అయితే వైద్యుల సమ్మెబాట పట్టడంతో రోగుల సంఖ్య తగ్గింది. తప్పనిసరి పరిస్థితుల్లో కొంతమంది రోగులు ఆర్‌ఎంపీలను.. మరి కొంత మంది నిడదవోలు, రాజమండ్రి ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదిలా ఉంటే వైద్యులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో రాజమండ్రి తదితర ఆస్పత్రుల నుంచి వైద్యులను పీహెచ్‌సీలకు తాత్కాలికంగా కేటాయించారు. తాత్కాలికంగా నియమితులైన వైద్యులు ప్రస్తుతం రోగులను పరీక్షిస్తున్నారు. అయితే ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మాత్రమే రోగులను పరీక్షించి వెళ్లిపోతుండడంతో.. మిగిలిన సమయాల్లో రోగులకు సేవలు అందడం లేదు.



రోగులు లేక నిర్మానుష్యంగా ఉన్న చాగల్లు పీహెచ్‌సీ



చాగల్లులో రోగులను పరీక్షిస్తున్న ఇన్‌చార్జ్ వైద్యురాలు

పల్లెల్లో అంతంత మాత్రమే..

మండల పరిధిలో ప్రతిరోజూ ఎంపిక చేసిన గ్రామంలో 104 ద్వారా సేవలు అందించాలి. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉన్నప్పుడు ఒక డాక్టర్ 104 ద్వారా గ్రామానికి వెళ్లి సేవలు అందించేవారు. మరొక వైద్యుడు పీహెచ్‌సీల్లో సేవలు అందించేవారు. ప్రస్తుతం వైద్యాధికారుల సమ్మెబాటతో తాత్కాలికంగా ఉన్న వైద్యులు పీహెచ్‌సీలో ఉంటున్నారు. దీంతో 104 వాహనాల్లో వైద్యుడు వెళ్లడం లేదు. ఉన్న సిబ్బంది మాత్రం గ్రామాలకు వెళ్లి అరకొరగా సేవలందించి వస్తున్నారు.

రోగులకు తప్పని ఇబ్బందులు



వైద్యులు సమ్మెబాట పట్టడంతో పీహెచ్‌సీల్లో అరకొరగా సేవలు అందుతున్నాయి. ఒకే డాక్టర్ ఉండడంతో అత్యవసర సమయాల్లో రోగులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో 104 వాహనం ద్వారా కూడా సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. వైద్యులు సమ్మె విరమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– అయినం నాగరాజు, కలవలపల్లి.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి వారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజాము నుంచే వందలాది మంది భక్తులు రావటంతో దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. భక్తులకు దాత రంగినీడి శ్రీనివాస్ దంపతుల ఆర్థిక సహాయంతో 8 వేల మందికి ఉచిత అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ, ప్రతి శనివారం భక్తులకు దాతల సహకారంతో ఉచిత అన్న సమారాధన, ప్రసాదాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

హృదయాలయంలో నిత్యావసరాల పంపిణీ

నిడదవోలు: మండలంలోని శంకరాపురంలోని మానసిక దివ్యాంగుల స్వచ్ఛంద సంస్థ హృదయాలయంలో రోటరీ క్లబ్ నిడదవోలు సెంట్రల్ ఆధ్వర్యంలో కలవలపల్లికి చెందిన ఆత్కూరి సురేష్ చౌదరి, విజయనగరం వాస్తవ్యులు కె.శ్రీలక్ష్మిల పుట్టినరోజు సందర్భంగా రూ.5 వేలు విలువచేసే నిత్యావసర సరకులు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పైడి సురేష్, కోశాధికారి జీవీవీ సత్యనారాయణ, బండి గోపాలకృష్ణ, కొండేపాటి రామకృష్ణ, నిర్వాహకులు డి.గణేష్‌బాబు, విశాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పలువురికి వనిత పరామర్శ



గోపాలపురంలో హేమంత్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తానేటి వనిత

గోపాలపురం: మాజీ హోంమంత్రి, గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తానేటి వనిత శనివారం గోపాలపురంలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను ఆమె పరామర్శించారు. గోపాలపురం మాజీ సర్పంచ్ బంటు గంగారత్నం కుమారుడు హేమంత్ కుమార్, మరపట్ల పాప, కొండే దుర్గమ్మ, తానేటి వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులను వనిత పరామర్శించారు. ఈమె వెంట నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, గెల్లా వెంకట శ్రీను, ముల్లంగి శ్యామ్ సుందర్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డి, తలారి చందు తదితరులు ఉన్నారు.

రూ.1కే బీఎస్ఎన్ఎల్ సిమ్

దేవరపల్లి: దీపావళి సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ఒక్క రూపాయికే సిమ్, అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 2 జీడీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు, 30 రోజుల కాలవ్యవధిలో అద్భుతమైన కొత్త ప్లాన్‌ను అందిస్తున్నట్టు టెలికాం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మేనేజరు శ్రీను శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్లాన్ నవంబరు 15వ తేదీ వరకు ఉంటుందని, ఇది పోర్టబిలిటీలకు కూడా వర్తింస్తుందని వివరించారు. పూర్తి వివరాలకు కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను సంప్రదించాలన్నారు.

ఆర్థిక సాయం



పెంటు సాహెబ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న కలెక్టర్ కీర్తి

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు గ్రామ రెవెన్యూ సహాయకుడు పెంటు సాహెబ్ ఇటీవల అనారోగ్యం కారణంగా మరణించారు. రాష్ట్ర రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ ద్వారా పెంటు సాహెబ్ కుటుంబానికి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శనివారం రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయంలో రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాపిరాజు, కొవ్వూరు డివిజన్ అధ్యక్షుడు కె.రవివిక్రమ్, జాయింట్ సెక్రటరీ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా అమ్మకాలు ప్రారంభం

తాళ్లపూడి (కొవ్వూరు): ఏటా తక్కువ ధరలకు, నాణ్యమైన బాణసంచా అమ్మకాలు చేస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు కంఠమణి రామకృష్ణ తెలిపారు. కొవ్వూరులోని రామా సొసైటీ వద్ద ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అమ్మకాలు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కంఠమణి రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్న కుమారి, ఏఎంసీ చైర్మన్ నాదేళ్ల శ్రీరామ్, కౌన్సిలర్ సూరపనేని చిన్ని, నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

గోపాలపురం: గత ప్రభుత్వంలో వలంటీర్‌గా పనిచేసిన ముప్పన కృపా వరప్రసాద్‌రెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏటా పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం హర్షనీయమని గ్రామ కార్యదర్శి అనురాధ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు తల్లిదండ్రులు ఏసురెడ్డి, బుజ్జానికమ్మల జ్ఞాపకార్థంగా పంపిణీ చేసిన వరప్రసాద్‌ను మండల మానవత జిల్లా రక్తనిధి డైరెక్టర్ జోడాల వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు నెల్లి చంద్రశేఖర్‌లు అభినందించారు.

హైవేపై వ్యాన్ బోల్తా



దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద బోల్తా పడిన వ్యాన్

దేవరపల్లి: యర్రవరం నుంచి భీమడోలు సమీపంలోని రొయ్యల పరిశ్రమకు కాళీ డ్రమ్ములతో వెళుతున్న బొలెరో వ్యాన్ దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద శనివారం బోల్తా పడింది. వ్యాన్ ముందు టైర్ పేలిపోవడంతో వ్యాన్ అదుపుతప్పి రోడ్డు ప్రక్కన ఉన్న పెన్సింగ్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే వ్యాన్‌ను తొలగించారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని పేర్కొన్నారు.

బాణసంచా నిల్వ ఉంచిన ఇద్దరిపై కేసు

తాళ్లపూడి: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయడం, అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తాళ్లపూడి ఎస్సై రామకృష్ణ హెచ్చరించారు. మండలంలో శనివారం పలుచోట్ల అక్రమంగా బాణసంచా నిల్వ చేసిన వారిపై కేసులు నమోదు చేశారు. అన్నదేవరపేటలో సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి వద్ద రూ.5 వేలు విలువ చేసే సామాగ్రి, మలకపల్లిలో సీతారామయ్య వద్ద రూ.10 వేలు విలువ గల బాణసంచా సామాగ్రిని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో సంక్షేమం గాలికి



పుల్లలపాడులో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ, రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తానేటి వనిత

- సంపద కాదు.. సమస్యలు సృష్టిస్తున్నారు
- గత ప్రభుత్వంలో సుస్థిరాభివృద్ధి
- వైఎస్సార్ సీపీ గోపాలపురం కన్వీనర్ తానేటి వనిత

నల్లజర్ల: పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పేదల బతుకులు రోజురోజుకు దయనీయంగా మారుతున్నాయని, సంపద సృష్టిస్తానంటూ కబుర్లు చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలను పట్టించుకోవడం మానేసిందని నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ హోంమంత్రి తానేటి వనిత మండిపడ్డారు. పుల్లలపాడులో శనివారం రాత్రి సర్పంచ్ అల్లూరి సూర్యచంద్రరావు, ఎంపీటీసీ వేగిప్రతాప్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొక్కిరపాటి వెంకట్రావు అధ్యక్షతన బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ, రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 18 నెలలైనా సమస్యలు పట్టించుకోకుండా ప్రచార ఆర్భాటాలు చేస్తుందని ఎద్దేవా చేశారు. తొలుత అదే ప్రాంగణంలో ఉన్న బాబూ జగజీవన్‌రామ్, వైఎస్ రాజశేఖరరెడ్డి, రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంకట సుబ్రహ్మణ్యం, మండల మహిళా అధ్యక్షురాలు యజ్జవరపు లక్ష్మి, అల్లూరి కృష్ణమూర్తి, ముప్పిడి వెంకటరత్నం, సయ్యద్ మునాఫ్, క్రిష్టియన్ సెల్ అధ్యక్షుడు పిట్టా జాన్ సుకుమార్, కారెం రాంబాబు, చెల్లారి రామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



రామన్నపాలెంలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ'లో మాట్లాడుతున్న సతీష్

దేవరపల్లి: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి అవగాహన కల్పించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని రామన్నపాలెంలో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపాక గాంధీ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో కూచిపూడి సతీష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మోసపూరితమైన సూపర్ సిక్స్ హమీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వ పాలనపై ఆయన ధ్వజమెత్తారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి సత్తిసాయి ఈశ్వరరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీటీసీ సభ్యులు సత్తి జగదీశ్వరరెడ్డి, కరుటూరి నిత్యానందం, దోనెల్లి జానకీరామ్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వైద్యుల డిమాండ్లు నెరవేర్చాలి



కానూరు పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

పెరవలి: పీహెచ్‌సీ వైద్యులు న్యాయమైన డిమాండ్ల కోసం గత 14 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవటం దారుణమని, అందుకు వైద్యులకు మద్దతుగా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్నామని రాష్ట్ర మహిళా ఎంప్లాయిస్ అసోషియేషన్ సెక్రటరీ జయమణి తెలిపారు. కానూరు పీహెచ్‌సీ వద్ద శనివారం వైద్యులకు మద్దతుగా వైద్య సిబ్బందికి సంఘీభావం తెలుపుతూ నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆమె మాట్లాడుతూ, 14 రోజులుగా సమ్మె చేస్తున్న వైద్యుల డిమాండ్‌లను ప్రభుత్వం తీర్చాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వైద్యురాలు లావణ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెరవలి: గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే రహదారులు ముఖ్యమని, అది గమనించిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామీణ రహదారులకు నిధులు మంజూరు చేస్తున్నారని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పెరవలి నుంచి కొత్తపల్లి అగ్రహారం మీదుగా కాపవరం వరకు రోడ్డు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం కానూరు కో-ఆపరేటివ్ సొసైటీలో రైతులకు డివిడెంట్‌లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్‌లు గంగోలు సీతమ్మ, భావన మధుల సొసైటీ అధ్యక్షుడు వాకలపూడి వీర్రాజు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజనీ, ఎంపీటీసీ సభ్యురాలు కోలా లక్ష్మీపార్వతి, మత్తాల ఉషారాణి, రాపాక ప్రమీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని చిన్నాయగూడెంలో పలు అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సుమారు రూ.7 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, నిర్మాణాలు పూర్తైన పనులను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంకట్రాజు మాట్లాడుతూ, నియోకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సస్యశ్యామలం చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆంద్రు అనిల్, మాజీ ఎంపీపీ గడా మురళీ అజీత్ కుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కొయ్యలమూడి సుధారాణి పాల్గొన్నారు.

క్వారీ అనుమతులపై ప్రజాభిప్రాయ సేకరణ



దుద్దుకూరులో ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత

దేవరపల్లి: మండలంలోని లక్ష్మీపురంలో క్వారీ ఏర్పాటుకు పర్యావరణ అనుమతుల కోసం యజమాని కె.నాగవెంకటకృష్ణ చేసుకున్న ధరఖాస్తుపై కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ప్యానల్ బోర్డు చైర్మన్, కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత, పర్యావరణ శాఖ అధికారులు దుద్దుకూరు క్వారీ ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ పరిరక్షణ సంస్థల ప్రతినిధులు, క్వారీ కార్మికుల నాయకులు, క్వారీ యజమానులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. పర్యావరణ శాఖ నిబంధనల మేరకు మాధవీ స్టోన్ క్రషర్ ఏర్పాటుకు, క్వారీ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలని అధికారులకు వివరించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు లిఖితపూర్వకంగా అభిప్రాయాలను అధికారులకు అందజేశారు. లక్ష్మీపురం గ్రామంలో 7.156 ఎకరాల భూమిలో మొర్రం గ్రావెల్, ఆర్డీనరీ ఎర్త్, రోడ్డు మెటల్, బల్లాస్ట్ క్వారీ లీజులకు అనుమతి ఇవ్వాలని జయమాని కె.నాగవెంకటకృష్ణ ప్రతిపాదించినట్టు ఆర్డీఓ రాణి సుస్మిత తెలిపారు. సమావేశంలో 29 మంది తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా, నోటి ద్వారా చెప్పారని, వీటి మినిట్స్‌ను కాలుష్య మండలికి పంపిస్తామని ఆమె తెలిపారు. పర్యావరణ శాఖ ఈఈ శంకరరావు మాట్లాడుతూ, పరిశ్రమలు, క్వారీలు, క్రషర్ల ఏర్పాటుకు, పరిశ్రమల్లో ఉత్పత్తిని పెంచడానికి పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన సూచించారు. లక్ష్మీపురంలో రెండు, కొవ్వూరు మండలం ఐ.పంగిడిలో ఒక క్వారీ, క్రషర్ ఏర్పాటుపై ఈ వారంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించినట్టు ఆయన తెలిపారు. క్వారీ క్రషర్స్ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణరాజు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మస్తాన్, క్వారీ క్రషర్స్ కార్మిక సంఘం అధ్యక్షుడు కస్సే సత్యనారాయణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాట్లాడారు. తహసీల్దార్ శ్రీనివాస్, పలువురు యజమానులు, పాల్గొన్నారు.

సేవ్ ద ఎర్త్‌పై విద్యార్థులకు అవగాహన



తాళ్లపూడిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

తాళ్లపూడి: సాంప్రదాయాన్ని పాటిస్తూ, వాతావరణాన్ని కలుషితం కలిగించని విధంగా దీపావళి పండగను జరుపుకోవాలని తాళ్లపూడి ఎస్సై రామకృష్ణ తెలిపారు. తాళ్లపూడిలోని మాంటిస్సోరీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి దీపావళిపై, సేవ్ ద ఎర్త్, సేవ్ వరల్డ్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీని నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ, దీపావళి అంటే పాఠ్య పుస్తకాల్లో బోధించే విధంగా దీపాల వరుస, చీకటిని పారదోలుతూ దీపాలను వెలిగించాలనే అంశాలను పాటించాలన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ, జనసేన కార్యకర్తలు



టీడీపీ, జనసేన కార్యకర్తలను సాదరంగా ఆహ్వానిస్తున్న తానేటి వనిత

నల్లజర్ల: అధికారంలోకి వచ్చిన 18 నెలలకే కూటమి మోసాలు బయటపడుతున్నాయని, కార్యకర్తలను ఎక్కడా పట్టించుకోవడం లేదని, అంతా అగ్రవర్ణాల చేతిలోనే పాలన సాగుతుందని, అందుకే ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో పార్టీలో చేరుతున్నట్టు పుల్లలపాడుకు చెందిన టీడీపీ కార్యకర్తలు కొండాబత్తుల కళ్యాణ్, దిడ్డి మధు, తాడిగడప కార్తీక్, జనసేనకు చెందిన పాందూరి దినేష్‌లు తానేటి వనిత సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందర్ని వనిత, మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రమణ్యం పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

బాలికల శ్రేయస్సే భవితకు మార్గం

నిడదవోలు రూరల్: బాలికల శ్రేయస్సే భవితకు మార్గమని ఐసీడీఎస్ పెరవలి సీడీపీఓ ఎం.ఆశా రోహిణి అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాలు పురస్కరించుకొని బాల్య వివాహాలు, పోక్సో చట్టం, బాలికల హక్కుల తదితర అంశాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం బాలికలకు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, సొసైటీ అధ్యక్షుడు ఉప్పులూరి రామ్మోహన్‌రావు, మాజీ సర్పంచ్ ఎండీ అక్రం, సెక్టర్ సూపర్‌వైజర్లు పి.నళిని, సీహెచ్.లక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



ఐ లవ్ నిడదవోలు పార్కు వద్ద ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఫ్లెక్సీల తొలగింపు

సాక్షి ఇంపాక్ట్

నిడదవోలు: పట్టణంలోని గణపతి జంక్షన్ ఐ లవ్ నిడదవోలు పార్కు వద్ద అనుమతులు లేకుండా జనసేన నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో ఈనెల 18న సాక్షిలో 'ఫ్లెక్సీలు తొలగించరా!' అనే శీర్షికన ప్రచురించిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, టౌన్ ప్లానింగ్ అధికారి సుప్రయలు ఆదేశాలతో శనివారం పార్కు వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉన్న ఫ్లెక్సీలను పూర్తిగా తొలగించారు. దీంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రంప్ సుంకాల పెంపుపై మోదీ మౌనం వీడాలి



సీపీఎం రాష్ట్ర కమిటీ ముద్రించిన పుస్తకాన్ని విడుదల చేస్తున్న ఉమా మహేశ్వరరావు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకల పెంపుపై ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ మౌనం వహించడం దేశానికి ప్రమాదకరమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక శ్యామలా సెంటర్‌లోని సీపీఎం కార్యాలయంలో భారత్‌పై ట్రంప్ సుంకాల యుద్ధం అనే పేరుతో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ముద్రించిన పుస్తకాన్ని ఉమామహేశ్వరరావు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ, భారత్ అమెరికాకు ఎగుమతి చేసే వాటిపై సుంకాలు తక్కువగా ఉన్నాయని, మనం దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలు అమెరికా పెద్ద మోతాదులో విధిస్తూ భారత ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసే పరిస్థితి తీసుకొచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రతిఘటించాలని లేని పక్షంలో దేశ ఆర్థిక వ్యవస్థను రక్షించుకునేందుకు సీపీఎం వామపక్షాలు కలిసి ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.పవన్, జువ్వల రాంబాబు, జిల్లా కమిటీ సభ్యుడు బి.పూర్ణిమరాజు తదితరులు పాల్గొన్నారు.